ప్రజాశక్తి

మంగళవారం 7 మే 2024 8 పేజీలు




గుంటూరు పల్నాడు



పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ

టిడిపి, వైసిపి బాహాబాహి - రాళ్లు రువ్వుకున్న ఇరు పక్షాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నరసరావుపేటకు చెందిన సత్యనారాయణరెడ్డి పోలింగ్ కేంద్రం బయట ఉన్న టిడిపి వారిని మీకు ఇక్కడ ఏం పని అని ప్రశ్నించారు. అతని సెల్‌ఫోన్‌కు జగన్ బొమ్మ ఉండడం తమను ప్రశ్నించడాన్ని తట్టుకోలేక ఆగ్రహం వ్యక్తం చేసిన టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు సత్యనారాయణ రెడ్డిని దూషించి దాడి చేసేందుకు ప్రయత్నించారు. కారులో ఎక్కించుకొని కొంత దూరం తీసుకువెళ్లి ఆర్మీ ఉద్యోగి అని తెలిసి తిరిగి మళ్లీ పోలింగ్ కేంద్రం వద్ద దిగబెట్టారు. ఈ లోగా తనపై కారులో ఉన్న వ్యక్తులు పిడి గుద్దులు గుద్దారని సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. దీంతో వైసిపి గ్రూపు పోలింగ్ కేంద్రం ఎదురుగా ఉన్న వైసిపి పార్లమెంట్ కార్యాలయంలో గుమిగూడి ఉన్న వైసిపి నాయకులు కార్యకర్తలు కర్రలతో రాళ్లతో ఒక్కసారిగా టిడిపి శ్రేణులపైకి దూసుకువచ్చారు. ఇరు గ్రూపులు రాళ్ల రువ్వుకున్నారు. ఈ ఘటనలో సత్తెనపల్లి కూటమి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అనుచరుని కారును వైసిపి నాయకులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి ముఖ్య నాయకులు పోలింగ్ కేంద్రం వద్దకు వస్తున్న క్రమంలో వైసిపి శ్రేణులు వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. పోలీసులు సిఆర్‌పిఎఫ్ బలగాలు ఇరు ▶ 2లో

పోస్టల్ బ్యాలెట్‌లకు రీపోలింగ్

చిలకలూరిపేట ఘటనపై ఈసి సీరియస్

1219 ఓట్లు నిలిపివేత-మళ్లీ నిర్వహించాలని ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వల్ల 1219 మంది ఉద్యోగుల ఓట్లను ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. పోస్టల్ బ్యాలెట్ బదులు ఈవిఎంలకు వినియోగించే బ్యాలెట్‌లను వినియోగించారని ఎన్నికల పరిశీలకులు గుర్తించారు. చిలకలూరిపేట నియోజకవర్గం సంబంధించి పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి గణపవరం జిల్లా పరిషత్ స్కూలులో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం పి.వోలు,ఎపివోలకు పోలింగ్‌నిర్వహించారు. మొత్తం 1219 మంది ఉదయం నుంచిసాయంత్రం వరకు క్యూ లోనిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం పోలింగ్ పూర్తయిన తరువాత అధికారులు పొరపాటును గుర్తించారు. పోస్టల్ బ్యాలెట్‌లకు బదులు ఈవిఎంలలో పెట్టే బ్యాలెట్‌లను ఉద్యోగులకు అందచేశారు. ఉద్యోగులు ఈ బ్యాలెట్‌లపై ఓటు వేశారు. ఓటింగ్ పూర్తయిన తరువాత గుర్తించిన అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియ చేశారు. ఈవ్యవహారంపై ఉన్నతాధికారులు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు నివేదించారు. ఈ అంశంపై టిడిపి నాయకులు ఈసికి ఫిర్యాదు చేశారు. 1219 మంది ఉద్యోగులు ఓట్లు ▶ 2లో



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి

టిడిపి మేనిఫెస్టోను నమ్మొద్దు

మాచర్ల ఎన్నికల సభలో సిఎం జగన్

ప్రజాశక్తి - మాచర్ల

తాను గత ఎన్నికల ముందు చెప్పిన పథకాలన్నీ అమలు చేశానని మూడు సార్లు సిఎంగా చేసిన చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎప్పుడు నేరవేర్చలేదని, మరోసారి కొత్త వాగ్ధానాలు, మేనిఫెస్టోతో వస్తున్నారని వైసిపి అధినేత, సిఎం జగన్ అన్నారు. సోమవారం మాచర్లలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. టిడిపి మేనిఫెస్టోను నమ్మద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. మీ కుటుంబంలో మా ప్రభుత్వం ద్వారా సహాయం పొందితేనే మాకు మద్దతు తెలియజేయండని కోరారు. గత టిడిపి పాలనలో రైతు రుణ మాఫీ, డ్వాక్రా రుణ మాఫీ చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలను ఆదుకున్నామని అన్నారు. ఈ పథకాలన్నీ చంద్రబాబు గతంలో ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మాచర్ల వైసిపి అభ్యర్థి పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి, నరసరావుపేట ఎంపి అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌ను ప్రజలకు పరిచయం చేసి వారిని గెలిపించాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో హెలికాప్టర్ దిగి బస్సు ద్వారా పట్టణంలో ప్రధాన రహదారి శ్రీనివాస మహల్ ఎదురుగా ఏర్పాటు చేసిన సభా వేధిక వద్దకు వచ్చి అర్ధగంటపాటు ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భారీగా వైసిపి పార్టీ అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి విమర్శలు గుప్పించారు. మాచర్లకు బ్రహ్మరెడ్డి వచ్చిన తరువాత కోట్లాటలు, ఫ్యాక్షనిజం పెరిగిందన్నారు. ఆయన రాకముందు నియోజకవర్గం ప్రశాంతంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సిఎం చేసేందుకు అందరం కలిసి పనిచేద్దామన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 4722 ఓట్లు పోలింగ్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5, 6 తేదీల్లో పిఒలు, ఎపిఒలు, మైక్రో అబ్జర్వర్లు 4722 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. మొదటి రోజు 2394 ఓట్లు, రెండో రోజు 2328 ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో 20,755 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా ఇప్పటి వరకూ 22.75 శాతం ఓట్లు పోలయ్యాయి. ఓపిఒలు, ఇతర ఎన్నికల సిబ్బంది, అత్యవసర సేవల్లో ఉన్న వారికి 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవటానికి ఫెసిలిటేషన్ సెంటర్లలో ఏర్పాట్లు చేస్తున్నారు.

అసెంబ్లీ	పోస్టల్ బ్యాలెట్లు	పోలైనవి
తాడికొండ	1560	499
మంగళగిరి	2825	506
పొన్నూరు	2421	576
తెనాలి	2850	536
ప్రత్తిపాడు	2570	597
గుంటూరు వెస్ట్	5751	1248
గుంటూరు ఈస్ట్	2778	760
మొత్తం	20755	4722

రేపు తాడేపల్లిలో బహిరంగ సభ

హాజరుకానున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



ప్రజాశక్తి-మంగళగిరి

ఇండియా వేదిక తరపున మంగళగిరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు ఎంపీ స్థానం సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ విజయాలను కాంక్షిస్తూ తాడేపల్లిలో బుధవారం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. సభ సాయంత్రం ఐదు గంటలకు తాడేపల్లి పట్టణం కృష్ణుడి గుడి సెంటర్లో ఉంటుందని, సభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య ప్రసంగిస్తారని తెలిపారు. గత పది సంవత్సరాల బిజెపి పాలనలో దేశవ్యాప్తంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి అని అన్నారు. బిజెపి పాలన భారత రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలకు విగాదం కలిగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి పార్టీలో రాష్ట్రంలో విమర్శించుకుంటున్నారు గానీ, కేంద్రానికి వచ్చేసరికి బిజెపికి మద్దతు పలుకుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలను, జనసేన, బిజెపి పార్టీలను ఓడించాలని అన్నారు. బహిరంగ సభకు సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ మతోన్మాద బిజెపి పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ సలీం మాట్లాడుతూ ఇండియా బ్లాక్ వేదిక ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేసిందని అన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఏడాదికి రూ.లక్ష చొప్పున అందిస్తారని తెలిపారు. వద్ధాప్య పెన్షన్ పెచుతున్నట్లుగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కె.జీవన్ సాగర్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు, మహిళలు అండగా ఉండాలంటే ఇండియా బ్లాక్ వేదిక అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ నాయకులు వై.వెంకటేశ్వరరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, ఇ.అప్పారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, కాంగ్రెస్ నాయకులు ఆర్.హనుమంతరావు, కె.రాధిక పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

పిడుగు పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం పెదపాలెంలో, గింజుపల్లిలో సోమవార పిడుగుపడిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పెదపాలెంలో సోమవారం సాయంత్రం పిడుగు పాటుకు ▶ 2లో



దంతాల లక్ష్మీనారాయణ, ధారావత్ బాబు నాయక్



ఎన్నికల ప్రచారంలో సిపిఐ, సిపిఎం నాయకులు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - తుళ్లూరు

గుంటూరు పార్లమెంట్,తాడికొండ అసెంబ్లీ నియోజక వర్గ ఇండియా వేదిక అభ్యర్థులు జంగాల అజయ్ కుమార్, మంచాల సుశీల్ రాజాను గెలిపించాలని సిపిఎం,సిపిఐ రాజ ధాని డివిజన్ నాయకులు ఎం.రవి, ముప్పాళ్ల శివ శంకరరావు కోరారు. సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఎం,సిపిఐ నాయకులతో పాటు కాంగ్రెస్ అభ్యర్థి సుశీల్ రాజా పాల్గొన్నారు. ఎన్నికల ప్రచా రంలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. ఈ సంద ర్భంగా రవి మాట్లాడుతూ, ప్రజాస్వామం మనుగడ సాగిం చాలంటే కేంద్రంలో బిజెపిని,రాష్ట్రంలో నియంతృత్వ పోకడ లతో రాష్ట్రాన్ని తిరోగమన దిశగా పయనింపజేస్తున్న వైసిపిని ఓడించాలని అన్నారు.ఎనిమిది కేంద్ర బడ్జెట్లలో అమరావతి రాజధానికి పైసా నిధులు కేటాయించకుండా బిజెపి మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్,సిపిఐ అభ్యర్థుల గెలుపు నకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. శివ శంకర రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై టిడిపితో సిపిఐ, సిపి ఎం కలిసి పని చేశాయని, ఏమాత్రం సంప్రదించకుండా ఎన్ని కలలో బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకుందని అన్నారు. కేం ద్రంలో బిజెపిని, రాష్ట్రంలో వైసిపి, కూటమిని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సుశీల్ రాజా మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశంలో మతతత్వ ధోరణులు పెచ్చరిల్లుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయ కులు గడ్డం కష్ణ,షేక్ జానీ,పి వెంకటేశ్వర్లు,కె ఆంజనేయులు, సిపిఐ నాయకులు కె వి వి ప్రసాద్,బైరాపట్నం రామకష్ణ

గ్రామాల్లో ప్రచారం

గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్,తాడికొండ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి మంచాల సుశీల్ రాజా గెలుపును కాంక్షిస్తూ సిపిఐ, సిపిఎం నాయకులు సోమవారం రాజధాని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

తెనాలిలో శివకుమార్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు పాత శివాలయం, గంగానంపేట ప్రాంతాలలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నూటికి నూరు శాతం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ప్రభుత్వం వైసీపీ అని అన్నారు. ఇల్లు లేని ప్రతి నిరుపేదకు నివేసిన స్థలం కేటా యించి, అధిక సంఖ్యలో గహ నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రతి గడపకు సంక్షేమం అందించామని, ప్రజలు ఈ ఎన్నికల్లో తనను గెలిపించాల్సిందిగా కోరారు. ప్రచారంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ సాయి హరే రామ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పోలీసు సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేడు పోలీసు సిబ్బందికి నిర్వహించనున్న పోస్టల్ బ్యాలె ట్ ను జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ లోతేటి సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదే శించారు. సోమవారం నరసరావుపేట కలెక్టరేట్ నుండి వేబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ 83 శాతం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఓటు కలిగి ఉండి ఎన్ని కల విధులు నిర్వహించుచున్న సిబ్బందికి 7,8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలన్నారు. హెూం ఓటింగ్ టీములకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ

(మొదటి పేజీ తరువాయి)

పక్షాలను చెదరగొట్టాయి.

అరవిందబాబుపై కేసు నమోదు చేయాలి : గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

విషయం తెలుసుకున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాసరెడ్డి రొంపిచర్ల మండలంలో ఎన్నికల ప్రచారం మధ్యలో ముగించుకొని పోలింగ్ కేంద్రానికి వచ్చారు. పోలింగ్ కేంద్రం వద్ద సరైన భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమైయ్యారని ఆగ్రహం



ధ్వంసం అయిన కారు

వ్యక్తంచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద విశ్రాంత ఉద్యోగిపై టిడిపి శ్రేణులు దాడి చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.సరోజినిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. టిడిపి నాయకులు కార్యకర్తలు రెచ్చిపోయి వివాదాలు సృష్టిస్తే సహించేది లేదన్నారు. టిడిపి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రోత్సాహంతోనే వివాదం చెలరేగిందని, ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా విశ్రాంత ఉద్యోగి టిడిపి శ్రేణులను దూషించి దుర్భాషలాడారని దీంతో స్వల్ప వివాదం చోటుచేసుకుందని పోస్టల్ బ్యాలెట్ లో 75 శాతంపైగా టిడిపి అనుకూలంగా ఉండడంతో ఓర్చుకోలేక తమపై అనవసరంగా దాడి చేశారనిచదలవాడ అరవిందబాబు అన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వైసిపి శ్రేణులకు అండగా ఉంటూ టిడిపి నాయకులు కార్యకర్తలపై దాడిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లకు రీపోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

మురిగిపోతున్నాయని తెలిసి వెంటనే వాటిని లెక్కింపులోకి తీసుకోకుండా రీపోలింగ్ నిర్వహించాలని, సంబంధిత బాధ్యులపై చర్య తీసుకోవాలని ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. పల్నాడు జిల్లాలో మొత్తం 16,282 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా గత రెండు రోజుల కాలంలో 9364 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగతా వారు మంగళ, బుధవారాల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందంటున్నారు. 7,8 తేదీల్లో పోలింగ్ సిబ్బంది, పోలీసులు, వివిధ శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు అవకాశం ఇచ్చారని అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో గత రెండు రోజుల కాలంలో 4722 మంది ఉద్యోగులు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 20755 మంది దరఖాస్తు చేసుకున్నారు. గుంటూరు పశ్చిమలో అత్యధికంగా 5751 మంది ఉన్నారు. గుంటూరు తూర్పులో 2778 మంది ఉన్నారు. అయితే జిల్లాలో ప్రత్యేకంగా మొదటి రోజులు పి.వో.ఎపివోలతో పాటు మైక్రో అబ్జర్వర్లకు మాత్రమే పోస్టల్ ఓటు వినియోగించుకోవడానికి అవకాశం ఇచ్చామని మిగతా వారంతా 7,8 తేదీల్లో పోస్టల్ ఓట్లు వినియోగించుకోవచ్చు నని అధికారులు తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో పి.వో, ఎపివోలకు ఉదయం పూట శిక్షణ, సాయంత్రం నుంచి పోలింగ్‌కు అవకాశం ఇచ్చా మని అధికారులు తెలిపారు.


పిడుగు పడి ఇద్దరు మృతి

(మొదటి పేజీ తరువాయి)

దంతాల లక్ష్మీనారాయణ(45), సోమవారం రాత్రి గింజు పల్లిలో వృద్ధుడు ధారావత్ బాబు నాయక్(62) మృతి చెందారు.ఒక్కసారిగా వర్షం కురుస్తుండటంతో చేలో ఉన్న ఎద్దులను ఇంటికి తరలించుకునేందుకని లక్ష్మీనారాయణ పొలం వద్దకు వెళ్లాడు. పెద్ద శబ్దంతో పిడుగుపాటుకు గురై లక్ష్మీనారాయణ పంటలో పడిపోవడాన్ని సమీప పంట పొలాల్లో పనిచేస్తున్న వారు చూసి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు.మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ధారావత్ బాబు నాయక్ కూడా పంట పొలంలో ఉన్న గేదెలను ఇంటికి తరలించేందు కని పొలం వద్దకు వెళ్లాడు ఎంతసేపటికి రాకపోవడంతో బంధువులకు అక్కడికి వెళ్లి చూడగా మృతి చెంది ఉండటాన్ని గమనించారు. మృత దేహాన్ని ఇంటికి తరలించారు. మృతునికి భార్య దీనా బాయ్ ,ఒక కొడుకు,ఒక కుమార్తె ఉన్నారు

రొంపిచర్లలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : ప్రతిపక్షం ఎన్ని పొత్తులు పెట్టుకున్నా వైసిపి ప్రభంజనంలో చిత్తు కావడం ఖాయమని వైసిపి నరస రావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం రొంపిచర్ల మండలంలోని అలవాల, అచ్చయ్యపాలెం, తురిమెల్ల, నరసరావుపేట మండలంలోని ఇస్సపాలెం, ములకలూరు, అగ్రహారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



నిర్వహించారు. ఆయా ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. టిడిపి నాయకుల తీరుతో వృద్ధులు పింఛన్ తీసుకోవడానికి వెళ్లి మరణించారని అన్నారు. సంక్షేమ పథకాలను అడ్డు కోవడానికి టిడిపి కుట్రలు పన్నుతోందని విమర్శించారు.



రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రెండోవ రోజైన సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుండి ఉద్యోగులు పోలింగ్ బూత్ వద్ద బారులు తీరారు. ఎన్నికల విధులు ల్లో పాల్గొనే వివిధ ప్రభుత్వ శాఖల అధి కారులు ఉపాద్యాయులు పోస్టల్ బ్యాలెట్ ను విని యోగించు కున్నారు. సత్తెనపల్లి నియోజక వర్గంలో ఓటు హక్కు వున్న 311 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసు కున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఇతర జిల్లాలు ఇతర నియోజక వర్గాల్లో ఓటు హక్కు వున్న ఉద్యోగులు 287 మంది మొత్తం 598 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

718 ఓట్లు నమోదు

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇతర జిల్లాలు 574 పోస్టల్ బ్యాలట్ట ఓట్టకు గాను 505 ఓట్లు నమోదైనట్లు అధికారులు తెలి పారు. సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు కార్యక్రమం జరిగింది. మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధి లోని 213 ఓట్లు వేశారు. మొత్తం 718 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు జిల్లా
పల్నాడు జిల్లా

టిడిపి గెలిస్తే ల్యాండ్ టైటిలింగ్ రద్దు : చంద్రశేఖర్



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని ఎన్‌డిఎ కూటమి తరపున గుంటూరు లోక్‌సభ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. తాడికొండ, ఫిరంగిపురం మండలాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. తాడికొండ మండలం మోతడక, నిడుముక్కల, బడేపురం గ్రామాల్లో, అనంతరం ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్లూరు, ఎర్రగుంట్లపాడు, బేతపూడి గుండాలపాడు పొనుగుపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. తాడికొండ టిడిపి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌ను, తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆస్తులపై హక్కులు ప్రజలకు ఉంటాయని ప్రభుత్వానికి ఎలా ఉంటాయని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ తరువాత దస్తావేజులు ప్రభుత్వం దగ్గర ఎందుకు ఉంచాలి.? ఒరిజినల్ దస్తావేజులు ప్రభుత్వం దగ్గర నుంచి ప్రజలు జిరాక్స్ కాగితాలతో లావాదేవీలు ఎలా జరుపుతారని అన్నారు. తమ ఆస్తులు ఉన్నాయో! ఊడాయో! ప్రభుత్వం దయతలిస్తే గాని ప్రజలు తెలుసుకోలేని పరిస్థితి వస్తుందన్నారు. మన ఇంట్లో మనకు సంబంధించిన ఆస్తుల డాక్యుమెంట్లు ఉంటేనే భయం భయంగా గడుపుతాం. అలాంటిది సొంత ఆస్తుల దస్తావేజులు ప్రభుత్వం చేతులో పెట్టి జిరాక్స్ కాపీలు మాత్రం మనవద్ద పెట్టుకొని ఎలా ధైర్యంగా ఉండగలం? అని నిలదీశారు. వైసిపి అభ్యర్థి సుచరితకు హొంమంత్రి ఇచ్చినా అధికారాలన్ని సజ్జల రామకృష్ణారెడ్డి వద్దనే ఉన్నాయన్నారు. ఆమె ఈ పదవితో ఎవరికి మేలు చేయలేకపోయారన్నారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సరఫరా చేసే మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని తొలుత తానే చెప్పానన్నారు. ఇప్పటికైనా మద్యం మాని మీ ఆరోగ్యాలు కుదుటపరచుకోండని సూచించారు. ఎన్నికల తరువాత ఐఎఎస్ అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దేగల ప్రభాకర్, నిమ్మల శేషయ్య పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ల్యాండ్ టైటిలింగ్‌పై దుష్ప్రచారం

విడదల రజిని



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల్లో ఓటమి భయంతోనే లాండ్ టైటిలింగ్ చట్టంపై టిడిపి దుష్ప్రచారాలు చేస్తోందని వైసిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని విమర్శించారు. గుంటూరు 21వ డివిజన్‌లో సోమవారం ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ లాండ్ టైటిలింగ్ యాక్టు ఎంతో మంచి చట్టమని, ఈ చట్టం వస్తే భూకబ్జాలకు తెర పడుతుందని ఆ పార్టీ నాయకుడు పయ్యావుల కేశవ్ సాక్షాత్తూ అసెంబ్లీలో దానిని సమర్థిస్తూ మాట్లాడారని, చంద్రబాబు సొంతమీడియా కూడా ఆ చట్టం అద్భుతమని, ఈ చట్టం వస్తే రైతుల భూములకు భద్రత ఉంటుందని కథనం ప్రసారం చేశారని తెలిపారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో టిడిపి ఆ చట్టంపై దుష్ప్రచారం చేస్తూ, ఓటర్లను భయాందోళనలకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తున్నందుకు ఎన్నికల కమిషన్ కూడా చంద్రబాబు, లోకేష్‌లపై కేసులు నమోదు చేసిందన్నారు. ఈ చట్టాన్ని ప్రతిపాదించింది కేంద్ర ప్రభుత్వమని, చంద్రబాబుకు దమ్ముంటే ఈ చట్టం మంచిది కాదని మోదీ చేత చెప్పించాలన్నారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ టిడిపి ఎన్ని దుష్ప్రచారాలు చేసినా తాము అమలు చేసిన సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయని అన్నారు. తొలుత మంత్రి రజిని 21వ డివిజన్‌లో కొండా వెంకటప్పయ్య కాలనీ యతిరాజ నగర్, వికలాంగుల కాలనీ, భాను ప్రసాద్ కాలనీ, బోయల కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకటకృష్ణారెడ్డి, నాయకులు కడప రత్నాకర్, కండ్లకుంట గురవయ్య, అంగడి శ్రీనివాసరావు, చంద్రగిరి ధీరజ్ పాల్గొన్నారు.

ముస్లిముల రిజర్వేషన్లు ఎత్తివేస్తామనడం దుర్మార్గం

బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లిములకు రిజర్వేషన్లు ఎత్తివేస్తామనడం దుర్మార్గమని, అటువంటి పార్టీతో జతకట్టిన చంద్రబాబును ప్రజలు ఓడించడం ఖాయమని మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి సోమవారం ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు స్థానిక శ్యామలానగర్‌లోని మంత్రి నివాసానికి చేరుకుని వైసిపిలో చేరారు. స్థానిక కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి, చంద్రగిరి ధీరజ్ పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదు : నూరి ఫాతిమా



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదని గుంటూరు తూర్పు వైసిపి అభ్యర్థి నూరిఫాతిమా అన్నారు. సోమవారం 50, 10వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో జనసేన, బిజెపితో జట్టు కట్టి దొంగ హామీలిచ్చి ప్రజలను వంచించిన టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు ఇప్పుడు మళ్లీ అదే కూటమితో జతకట్టి సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్.. సూపర్ టెన్ అంటూ దొంగ హామీలు ఇస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడూ మేనిఫెస్టోలను అమలు చేయలేదన్నారు. ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. రాజకీయ నాయకుడుంటే ఎలా ఉండాలి? ఒక మాట చెబితే ఆ మాట మీద తాను నిలబడతాడనే నమ్మకం ఉండాలి? అదిగో ఫలానా వ్యక్తి మా నాయకుడు, మా లీడర్ అని ఏ కార్యకర్త అయినా కాలర్ ఎగరేసుకుని చెప్పుకునేలా ఉండాలన్నారు. అటువంటి వ్యక్తే మన జగన్మోహన్‌రెడ్డి అని చెప్పారు. చంద్రబాబులా చేస్తే కాలర్ ఎగరేసుకుని చెప్పడం మాట దేవుడెరుగు.. ఎన్నికలు అయిపోయిన తర్వాత ప్రజలు కనిపిస్తే దొడ్డిదారిన పారిపోవాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు.


వైసిపితోనే సంక్షేమం:ముస్తాఫా

వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని టిడిపి వస్తే అన్నీ రద్దు చేస్తారని ఎమ్మెల్యే ముస్తాఫా అన్నారు. 56వ డివిజన్‌లో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గుంటూరు తూర్పునుంచి పోటీ చేస్తున్న నూరిఫాతిమాను, లోక్‌సభకు వైసిపి అభ్యర్థి కిలారి రోశయ్యను గెలిపించాలని కోరారు. టిడిపి పేదల గురించిపట్టించుకోదని అన్నారు. కేవలం బడా వ్యాపారస్తులు, కార్పొరేట్ రంగాలకు మేలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో వైసిపి విజయం ఖాయం అన్నారు. గతరెండుసార్లు తనను ఆదిరించినట్టుగా ఈ సారి తన కుమార్తె నూరి ఫాతిమాను గెలిపించాలని కోరారు.



గెలిచే ప్రయత్నం.. గెలుస్తాననే ధీమా..

బొల్లా బ్రహ్మనాయుడు, జీవీ ఆంజనేయులు మధ్య నువ్వా-నేనా అనట్లుగా



బొల్లా బ్రహ్మనాయుడు (వైసిపి)

జీవీ ఆంజనేయులు (టిడిపి)

చెన్నా శ్రీనివాసరావు (కాంగ్రెస్)

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వినుకొండ నియోజకవర్గంలో టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్య ముఖాముఖి పోటీ జరుగుతోంది. ఈ నియోజకవర్గం నుంచి టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు మొత్తం 14 మంది పోటీలో ఉన్నారు. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మరోసారి పోటీచేస్తుండగా గత ఎన్నికల్లో ఓడిపోయిన టిడిపి అభ్యర్థి జి.వి.ఆంజనేయులు కూడా మరో సారి పోటీలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా చెన్నా శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు. 2009, 2014 ఎన్నికల్లో వరుసగా రెండు పర్యాయాలు గెలిచిన ఆంజనేయులు 2019లో ఓడిపోయారు.

2019లో టిడిపి పై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత వల్ల వైసిపి అభ్యర్థి బొల్లాబ్రహ్మనాయుడు 32వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఈసారి వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోపాటు తాను చేసిన సేవాకార్యక్రమాలు తనను గెలిపిస్తాయని టిడిపి అభ్యర్థి జి.వి.ఆంజనేయులు చెబుతున్నారు. తాను చేసిన అభివృద్ధిపథకాలతోపాటు గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని వైసిపి అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. అంతేగాక పార్లమెంటు సభ్యులు అనిల్‌కుమార్ వల్ల తమ పార్టీకి బిసి ఓట్లు పెరుగుతాయని ఆయన చెబుతున్నారు. 2004 నుంచి ఆంజనేయులు నియోజకవర్గాన్ని అంటిబెట్టుకుని ఉన్నారు. 2009, 2014లో ఆయన గెలుపొందారు. వ్యాపార వేత్తగా పేరొందిన బొల్లా బ్రహ్మనాయుడు 2009లో ప్రజారాజ్యం తరపున వినుకొండ నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పెదకూరపాడులో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019లో ఆయనవినుకొండ నుంచి వైసిపి అభ్యర్థిగాపోటీ చేసి గెలిచారు. గత ఎన్నికల్లో బొల్లాకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జనరావు ఈసారి టిడిపిలో చేరి జి.వి.ఆంజనేయులు విజయంకోసం కృషి చేస్తున్నారు. గత రెండు నెలలుగా బొల్లా, జి.వి.ఆంజనేయుల ప్రచారం ఉధృతంగా సాగుతోంది.

1952లో సిపిఐ అభ్యర్థి పి.వెంకట శివయ్య స్వతంత్ర అభ్యర్థి పిఎస్.చౌదరిపై గెలిచారు. 1955లో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.గోవిందరాజు సిపిఐ అభ్యర్థి పి.వెంకట శివయ్యపై గెలుపొందారు. 1962లో సిపిఐ అభ్యర్థి పి.వెంకట శివయ్య కాంగ్రెస్ అభ్యర్థి భవనం జయప్రదపై విజయం సాధించారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి భవనం జయప్రద స్వతంత్ర అభ్యర్థి ఎ.వెంకటేశ్వర్లుపై గెలిచారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థి భవనం జయప్రద సిపిఐ అభ్యర్థి పి.వెంకట శివయ్యపై గెలుపొందారు. 1978లో స్వతంత్ర అభ్యర్థి ఆవుదారి వెంకటేశ్వర్లు స్వతంత్ర అభ్యర్థి జి.వెంకటేశ్వర్లుపై విజయం సాధించారు. 1983లో స్వతంత్ర అభ్యర్థి జి.వెంకటేశ్వరరావు కాంగ్రెస్ అభ్యర్థి ఎ.వెంకటేశ్వర్లుపై గెలిచారు. 1985లో సిపిఐ అభ్యర్థి జి.వెంకటేశ్వరరావు కాంగ్రెస్ అభ్యర్థి సిహెచ్.వి.నారాయణరావుపై గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి నన్నపనేని రాజకుమారి స్వతంత్ర అభ్యర్థి వి.యల్లమందరావుపై విజయం సాధించారు. 1994లో స్వతంత్ర అభ్యర్థి వి.యల్లమందరావు కాంగ్రెస్ అభ్యర్థి నన్నపనేని రాజకుమారిపై గెలిచారు. 1999లో టిడిపి అభ్యర్థి వి.యల్లమందరావు కాంగ్రెస్ అభ్యర్థి ఎం.మల్లికార్జునరావుపై గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.మల్లికార్జునరావు టిడిపి అభ్యర్థి జి.లీలావతిపై విజయం సాధించారు. 2009లో టిడిపి అభ్యర్థి జివి.ఆంజనేయులు కాంగ్రెస్ అభ్యర్థి చేబ్రోలు నరేంద్రనాథ్‌పై గెలిచారు. 2014లో టిడిపి అభ్యర్థి జివి.ఆంజనేయులు వైసిపి అభ్యర్థి ఎన్.సుధపై గెలుపొందారు. 2019లో పోటీ టిడిపి అభ్యర్థి జి.వి.ఆంజనేయులపై వైసిపినుంచి పోటీ చేసిన బొల్లాబ్రహ్మనాయుడు 32 వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఇండియా కూటమి తరుపున కాంగ్రెస్‌నుంచి చెన్నా శ్రీనివాసరావు బరిలో నిలిచారు.



అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు

ఎన్నికల ప్రచారంలో యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గురజాల

ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇంటికి మంజూరు చేస్తామని కూటమి తరుపున గురజాల నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జంగహేశ్వరపురం, చల్లగుడిపాడు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశ్శారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఓటేయాలని ప్రజలను కోరారు. తాము గెలిస్తే ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తానన్నారు. దీంతోపాటు గురజాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జంగా వెంకట కోటయ్య, వేముల వినోద్‌రెడ్డి, జమ్మికుంట లక్ష్మీనారాయణ, అడప శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపికి ఓటేయాలి : భాష్యం ప్రవీణ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే సంపద సృష్టించే చంద్రబాబు సిఎం కావాలని ఎన్‌డిఎ కూటమి తరుపున పెదరకూరపాడు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలో సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ భూములు మీకు ఉండాలంటే టిడిపికి ఓటేయాలని చెప్పారు. ఇప్పటివరకు జగన్ ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టడం, అమ్మటం మాత్రమే చేశారని, ఇప్పుడు ప్రజల ఆస్తులపై జగన్ కన్ను పడిందని విమర్శించారు. కుటుంబంలో చదువుకునే ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇవ్వటానికి టిడిపి కంకణం కట్టుకుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పింస్తుందని, రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తుందని చెప్పారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలంటే టిడిపి అధికారంలోకి రావటం ఒక్కటే మార్గమన్నారు. కార్మికులు, కర్షకులు, శ్రామికులు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే కూటమిని అధికారంలోనికి తీసుకురావాలని కోరారు. మహిళలకు రక్షణ, బీసీలకు అండగా ఉండేది టిడిపి అన్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థలు అధినేత భాష్యం రామకృష్ణ, ఆలోకం సుధాకర్‌బాబు, శ్రేణులు పాల్గొన్నారు.





రాష్ట్రం కోసం పోరాడే వారికి ఓటేయండి

సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావుకు విజయం కోసం ప్రచారం



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్ర ప్రయోజనాలు బిజెపికి తాకట్టు పెట్టిన వైసిపి, టిడిపి పార్టీలను ఓడించి. ప్రజల ప్రయోజనాల కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య కోరారు. మంగళగిరి ఎమ్మెల్యేగా సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు ఎంపీగా సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌కు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పెదవడ్లపూడి శివాలయం సెంటర్లో సోమవారం ప్రచారం చేశారు. ఇందులో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో కృష్ణయ్య మాట్లాడుతూ అవినీతి సామ్రాట్ గా ఉన్న బిజెపికి వంత పాడుతూ టిడిపి సాగిలపడటం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. రాష్ట్రాల హక్కుల కోసం కొట్టిన టిడిపి నేడు హక్కులు అరుస్తున్న నోరు మెదపకపోవడం బాధాకరమని అన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన హామీల అమలు చేయని బిజెపికి మద్దతు తెలపడం ఏంటి అని ప్రశ్నించారు. సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు అప్పారావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య, మండల కార్యదర్శి జాన్‌బాబు, కోటిలింగం, జె.సాంబశివరావు, వెంకట్రావు, నంబూద్రి, కంచర్ల రాంబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎర్రజెండాతోనే రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండాకే ఓటు వేయాలని జొన్నా శివశంకరరావు కోరారు. కొలనుకొండ జాతీయ రహదారి వద్ద ఉన్న ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక చట్టాలను సవరణ చేసిందని అన్నారు. అందులో భాగంగానే మోటార్ వెహికల్స్ 1988 సవరణ చేస్తూ, నూతన చట్టం జీవో నెంబర్ 10 6 ను తీసుకువచ్చిందని అన్నారు. ఈ చట్టం వలన రవాణా రంగం డ్రైవర్లకు పెద్ద ప్రమాదం ముంచుకొచ్చిందని అన్నారు. ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగితే నిర్లక్ష్యంగా వాహనం నడిపారని, డ్రైవర్ పారిపోయాడని ఎఫ్ఐఆర్ నమోదైతే 10 సంవత్సరాలు జైలు శిక్ష, 10 లక్షల రూపాయలు జరిమానా విధించడం వంటివి ఈ చట్టంలో ఉన్నాయని ఆయన విమర్శించారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలని ఎర్రజెండా, సిఐటియు పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేస్తూ డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ఏర్పాటు చేస్తామని నమ్మబలికారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 12 లక్షల మంది డ్రైవర్లు ఉంటే కేవలం రెండు లక్షల 65 వేల మంది డ్రైవర్లకు మాత్రమే పథకాన్ని వర్తింప చేశారని అన్నారు. సంక్షేమ పథకాలు డ్రైవర్లకు అమలు చేయకపోగా మతోన్మాద బిజెపితో చేతులు కలపటం దుర్మార్గమని ఆయన అన్నారు. రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించేది వామపక్ష పార్టీలు మాత్రమేనని చెప్పారు. యూనియన్ అధ్యక్షులు ఎస్కే మౌలాలి, వెంకటేశ్వరరావు, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు డి.వెంకట్ రెడ్డి, కే సాంబయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

జొన్న శివశంకరరావు, జంగాల అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ కుంచనపల్లిలో సిపిఎం శ్రేణులు ప్రచారం చేశ్శారు. ఇంటింటికి అభ్యర్థుల గుర్తులను చూపుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికై వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. మాజీ సర్పంచ్ అమ్మిశెట్టి సాంబయ్య రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించిన ఆయన వృద్ధాప్యంలో కదలలేని స్థితిలోనూ ప్రచారంలో పాల్గొన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినికాంత్, నాయకులు ఎ.గోపాలరావు, బి.ముత్యాలరావు, జె.రాజ్‌కుమార్, డి.వెంకటరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, ఎ.రంగారావు, పి.కృష్ణ, కె.సాంబశివరావు, ఎస్.కె గన్, పి.భార్గవ్, ఎ.నాగిరెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్‌టిఆర్ కట్ట, పుష్కరకాలనీ, ఎమ్మెల రామయ్య కాలనీ, ఉండవల్లిలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, కె.మేరి, డివి భాస్కరరెడ్డి, వై.బర్నబస్, డి.యోహాన్, లక్ష్మణరావు, ఏడుకొండలు, సామ్యేలు, దావీదు, కోటి, టి.బక్కిరెడ్డి, దినేష్, శ్యామ్, వేముల దుర్గారావు, బాష పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై మంత్రి రజిని ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న టిడిపి నాయకులపై మంత్రి విడదల రజిని పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం పోలీసులు కేసునమోదు చేశారు. టిడిపి లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి గల్లా మాధవి, పార్టీఇన్‌ఛార్జి మల్లెల రాజేష్ నాయుడుపై పలు సెక్షన్ల కింద పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అసత్య ప్రచారాలు, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పలు కుట్ర పూరిత పద్ధతుల ద్వారా దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారనే కారణంతో ఈ కేసు చేశారు.

రూ.5,46,990 నగదు, మద్యం సీజ్

ప్రజాశక్తి-గుంటూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి సోమవారం తనిఖీలు కొనసాగించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రూ.3,05,400, తెనాలి నియోజకవర్గ పరిధిలో రూ.లక్ష, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో జూద నిర్వహణకు సంబంధించి నగదు రూ.34,110, రూ.7,480 విలువగల 10.7 లీటర్ల మద్యం, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.లక్ష సీజ్ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ మొత్తం రూ.3 కోట్ల 17 లక్షల 17 వేల 881 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశారు.

దేశ, రాష్ట్ర అభివృద్ధి ఇండియా వేదికతోనే సాధ్యం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

దేశ అభివద్ధి ఇండియా కూటమితోనే సాధ్యమని ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చుక్కా చంద్రపాల్ అన్నారు. సత్తెనపల్లిలోని రంగా కాలనీ లెనిన్ నగర్ , శివాలయం ప్రాంతం నకరికల్లు మండలం నకరికల్లు లో చుక్కా చంద్రపాల్, ఎంపి అభ్యర్థి అలెగ్జాండర్ సుధాకర్ సిపిఎం,సిపిఐ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. చుక్క చంద్రపాల్ మాట్లాడుతూ దేశ సంపదను కార్పోరేట్లకు నరేంద్ర మోడీ ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రపన్నుతోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ కు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం అప్పుల్లో ముంచి వేసిందని అన్నారు. సిపిఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంతో అంటకాగుతున్న వైసిపి, టిడిపి,జనసేన పార్టీలను ఓడించాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడు దాసరి, జ్ఞాన్ రాజ్ పాల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె దుర్గారావు, నకరికల్లు మండల కార్యదర్శి ఈవూరి లక్ష్మారెడ్డి , సిపిఎం నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, దుర్గాబాయి, కొండా నాయక్ సిపిఐ నాయకులు ఇర్మయా కాంగ్రెస్ నాయకులు మాదంశెట్టి వేదాద్రి ముప్పాళ్ళ మండల అధ్యక్షులు కోట ఆనంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు చిన్న గురువులు జెట్టి శేఖర్, ఐజియా ,ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సుభాని, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు కంచర్ల కమల, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

రాష్ట్ర అభివృద్ధి ఇండియా వేదికతోనే సాధ్యమవుతుందని గురజాల ఇండియా వేదిక అభ్యర్థి తియ్యగూర యలమందారెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఎం,కాంగ్రెస్ నాయకులతో పట్టణంలోని సుందరయ్య కాలనీ,డ్రైవర్స్ కాలనీ,రసూల్ పేట, శ్రీనివాస్ కాలనీ,బ్రహ్మానందరెడ్డి కాలనీ, మారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కాంగ్రెస్, కమ్యూనిస్టు పాలనలో రాష్ట్ర,దేశ అభివృద్ధి చెందిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో గురజాల తనను, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అలెగ్జాండర్ సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తున్న పార్టీలను ఓడించాలని, హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా కోఆర్డినేటర్ జొన్నలగడ్డ యోహాన్, నాయకులు కాన్సిరాం, విజయ్, గోవిందు, వెంకటేశ్వర్లు,కృష్ణ,లక్ష్మీ,లింగయ్య,సంపూర్ణ, మస్తాన్,గోపి తదితరులు పాల్గొన్నారు.


సత్తెనపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చుక్కా చంద్రపాల్

బిసి కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొస్తాం

ప్రజాశక్తి - నరసరావుపేట

బిసి సామాజిక వర్గానికి గడిచిన ఐదేళ్లలో పదవులు అలంకారానికే తప్ప, అధికారాలు శూన్యమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ఉమ్మడి కూటమి నరసరావుపేట ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవ రాయలు, డాక్టర్ చదలవాడ అరవింద బాబు,జనసేన ఇంచార్జి సయ్యద్ జిలాని అన్నారు. సోమవారం నరసరావు పేట మండలం, రావిపాడులో యాదవుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. బిసి కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొస్తామని, నిధులు కేటాయించి, వారికి సముచిత గౌరవం కల్పిస్తామని అన్నారు. బిసి డిక్లరేషన్‌తో, రక్షణ చట్టంతో వారికి కవచంలా పనిచేస్తామని అన్నారు

నరసరావుపేట మండలంలో కూటమి ప్రచారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం తథ్యమని కూటమి గెలుపు ఎవరు ఆపలేరని నరసరావుపేట పార్లమెంట్ అసెంబ్లీ అభ్యర్థులు లావు శ్రీకష్ణ దేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట మండలంలోని రావిపాడు, అల్లూరివారిపాలెం, అర్వపల్లి,పెట్లూరివారిపాలెం, కాకాని, కోటప్పకొండ, యక్కలవారిపాలెం, గోనెపూడి,చింతలపాలెం,యలమంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవ రాయలు, అరవిందబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాతో పాటు నరసరావుపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఆయా గ్రామాలకు చెందిన 200 కుటుంబాలకు పైగా వైసిపిని వీడి టిడిపి లో చేరాయి.



సర్వేల్లో కూటమిదే గెలుపు : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

రాష్ట్రంలో ఏ సర్వే చూసినా కూటమిదే గెలుపు అంటున్న అంచనాలతో ముఖ్యమంత్రి జగన్, వైసిపి నేతలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, కూటమి వినుకొండ అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణ తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద సోమవారం పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన వారు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినుకొండ మండలం ఉప్పరపాలెం యాదవులు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. 20 కుటుంబాలు తెలుగుదేశం తీర్థం పుచ్చు కున్నాయి. ఆంజనేయులు భార్య లీలా వతి సమక్షంలోనూ మరో 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. బొల్లా పల్లిలో వైసిపిలో ఉన్న వారు రాజీనామా చేసి టిడిపిలో చేరారు.

టిడిపిలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా

ప్రజాశక్తి-విజయపురిసౌత్

తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని మాచల నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని తాళ్లపల్లి భైరవునిపాడు చింతల తండ నుండి బీసీ ఎస్సీ ఎస్టీలు 50 కుటుంబాల వారు వైసిపి పార్టీని వీడి టిడిపిలో చేరారు.

'సూపర్‌సిక్స్' తో ప్రతి కుటుంబంలో ఆనందం

ప్రజాశక్తి - మాచర్ల

పార్టీ అధికారంలోకి రాగనే సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబంలో ఆనందం ఉండేలా చూస్తామని టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మ నందరెడ్డి అన్నారు. తాళ్ళపల్లి, భైరవునిపాడు, చింతల తండా గ్రామాలకు చెందిన పలువురు ఎస్సి, ఎస్టి, బిసిలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు.


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్

ఈవీఎంలను భద్రపరిచే గదులు పటిష్టంగా ఉండాలి

ఈవీఎం ల భద్రపరచు గదులను పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఎల్. శివ శంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల సందర్భంగా నోడల్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికలకు సంబంధించి వ్యయ పరిశీలన విషయమై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. పి డబ్ల్యూ డి ఓటింగ్ ప్రక్రియ పై తీసు కుంటున్న చర్య లను అడిగి తెలుసు కున్నారు. అనంతరం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటి ఎన్ని అను మతులు ఇచ్చింది వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వీప్ యాక్టివిటి, డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ పనితీరు గురించి నిశితంగా వివరాలు సేకరించారు.

పోలింగ్ సిబ్బందికి నియామక పత్రాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్ని కలకు సంబంధించి ఓపిఓలుగా విధులు కేటాయించిన సిబ్బందికి నియామక ఉత్తర్వులు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివ శంకర్ అన్నారు. సోమవారం నరసరావుపేట కలెక్టరేట్ లో విద్యాశాఖ ,జిల్లా పంచాయతి శాఖ, ఐసిడిఎస్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిపిఓ భాస్కర్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



544 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి - మాచర్ల

రెండవ రోజు సోమ వారం కూడా ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగినట్లు రిటర్నింగ్ అధికారి, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం 1,020 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు విని యోగించుకున్నట్లు తెలిపారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 544 మంది అత్యవసర సర్వీసుల వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. 247 మంది ఇతర జిల్లాల వారు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపి అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే యత్నం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల వద్ద జరిగిన వివాదంపై కూటమి నరసరావుపేట ఎంపి అభ్యర్థి లావు శ్రీకృదేవ రాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి అరవింద బాబు స్పందించారు. మండలం లోని పెట్లూరువారిపాలెంలో ఎన్నికల ప్రచారంలో ఉండగా గ్రామంలో సోమవారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసురెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేయడం, వారి అనుచరులు పోలింగ్ బూత్ ల కర్రలు పట్టుకొని తిరుగుతూ టిడిపి నాయకులపై దాడులు చేయడాన్ని పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఉద్యోగులు అధిక శాతం టిడిపి అనుకూలంగా ఓట్లు వేస్తున్నారని ఇది ఓర్వలేక వైసిపి మూకలు భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులకు పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఓటమి భయంతో వైసిపి దాడులు : కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఓటమి భయంతోనే వైసిపి నాయకులు దాడులకు పాల్పడుతున్నారనీ టిడిపి,జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. సత్తెనపల్లి కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో ఆయన సోమ వారం విలేకరులతో మాట్లాడుతూ నకరికల్లు మండలం కుంకలగుంట టిడిపి నాయకులపై వైసిపి దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. టిడిపి నాయకులు నర్సరావుపేట వస్తున్న తరుణంలో వైసిపి గూండాలు టిడిపి నాయకుల కారును ధ్వంసంచేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన టిడిపి నాయకులపై పోలీస్ స్టేషన్ ఆవరణలోనే దాడి చేయడం దుర్మార్గం మన్నారు. మంత్రి అంబటి రాంబాబుకి ఓటమి భయం పట్టుకుని ప్రతిపక్షాలపై బురదజల్లుతున్నారనీ అన్నారు.

అబద్ధాల పుట్ట జగన్: పిల్లి మాణిక్యరావు

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ ప్రజలను మభ్యపెట్టి మాయ చేసి గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి ఒట్టి అబద్ధాల పుట్టా అని రాష్ట్ర టిడిపి అధికార ఎస్ఎస్సి అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు విమర్శిచారు. మండల పరిధిలోని బలుసుపాడు 75 తాళ్లూరు గ్రామాల్లో టిడిపి తరపు ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, బాగుపడాలన్న టిడిపి అధికారంలోకి రావాలని అన్నారు.

వైసిపి న్యాయవాది వ్యాఖ్యలు హేయం

ప్రజాశక్తి-వినుకొండ

బొల్లా బ్రహ్మానాయుడు నామినేషన్ తిరస్కరణ ఫిర్యాదుపై వైసిపి న్యాయ వాది ఎంఎన్ ప్రసాద్ వ్యాఖ్యలు హేయమైనవనీ ప్రముఖ న్యాయవాది కావూరి గోపీనాథ్ ఖండించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రహ్మానాయుడు గత నామినేషన్ల ప్రమాణ పత్రాల్లో ఉన్న సాక్ష్యాలు ఆధారంగా ఆయన నామినేషన్ తిరస్కరించాలని ఎన్నికల అధికారికి తాము ఫిర్యాదు చేస్తే దానిపై వైసిపి లీగల్ సెల్ న్యాయవాది ఎంన్. ప్రసాద్ విమర్శలు తగదన్నారు. భూముల పెత్తం దారులు తమ వెనుక ఉన్నారని విమర్శించడం తన దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. నామినేషన్ ప్రక్రియలో జరిగిన వాస్తవాలను ప్రస్తావించకుండా వైసిపి న్యాయవాది బుకాయిస్తూ కొప్పుకొండ చెరువు అంశాన్ని తీసుకు రావడం హాస్యాస్పదం అన్నారు.

13వ వార్డులో ప్రచారం

ప్రజాశక్తి - మాచర్ల

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసేందుకు టిడిపి అభ్యర్థులను గెలిపించాలని 13వ వార్డులో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ప్రజలను కోరారు. పలు బూత్‌లలో ప్రచారం చేపట్టారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి : సిఐటియు

ప్రజాశక్తి-తాడేపల్లి

పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులకు నాలుగు లేబర్ కోడ్‌లతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి సుందరయ్యనగర్‌లో మేడే సందర్భంగా బత్తుల రాజు భవన్ వద్ద సిఐటియు పతాకాన్ని మేస్త్రి తిరుపతయ్య ఆవిష్కరించారు. నేతాజీ మాట్లాడుతూ కంపెనీ యజమానులకు అనుకూలంగా కార్మికవర్గానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్మిక వర్గం చైతన్యవంతంతో దీన్ని తిప్పికొట్టాలన్నారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలన్నా, పౌర హక్కులు రక్షించబడాలన్నా ఎన్నికల్లో బిజెపిని, దాని మిత్ర పోఆలను ఓడించాలన్నారు. ఇండియా వేదిక బలపర్చిని సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావును, గుంటూరు ఎంపీగా పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కె.కరుణాకరరావు, ఎన్.నాగేశ్వరరావు, సిహెచ్.భుజంగరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నేతాజి


ఎ.సుహాసిని, కె.తోయజ, కె.బ్లెస్సీ

చాణక్య హైస్కూల్ అత్యుత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - చేబ్రోలు

ప్రతిఏడాది మాదిరే ఈ ఏడాది కూడా పదో తరగతి పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని చాణక్య హైస్కూల్ ప్రిన్సిపాల్ చుక్కా శివరామకృష్ణ తెలిపారు. ఎ.సుహాసిని 582/600, కె.తోయజ 576/600, కె.బ్లెస్సీ 564/600 మార్కులు సాధించారని చెప్పారు. ఎక్కువమంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారన్నారు. ప్రతివిద్యార్థినిపై ప్రత్యేక దృష్టిపెట్టి బోధించడం వల్లే ఇంత మంచి ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి వాటిని పెంపొందించడం, ఇష్టపడి చదివేలా మార్గనిర్దేశనం చేయడం తమ లక్ష్యమన్నారు. వెనబడిన విద్యార్థులను మెరుగ్గా రాణించేలా చేయడం, విద్యార్థులందరికీ మంచి భవిష్యత్‌ను అందించడం కోసం తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు తగిన విధంగా ప్రత్యేక ప్రణాళికతో బోధిస్తున్నామన్నారు.

మానవత్వం చాటుకున్న జియో ఉద్యోగులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



తిండి తిప్పల్లేక వారం రోజులుగా అవస్థ పడుతున్న వృద్ధురాలిని మానవత్వంతో చేరదీసిన ఘటన కొలనుకొండలో సోమవారం జరిగింది. ఊరు పేరు తెలియని వృద్ధురాలు కొలనుకొండ జాతీయ రహదారి అండర్ పాస్ క్రింద నిరాశ్యురాలై పడి ఉండడాన్ని గమనించిన మంగళగిరి జియో సంస్థ ఉద్యోగులు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి ఆమెను చూసి చలించిపోయారు. ఆమెకు దుప్పట్లు, దుస్తులు ఏర్పాటు చేసి, పొన్నూరు వృద్ధాశ్రమంలో చేర్పించారు.

బిజెపి, దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని బిజెపి దాని మిత్రపక్షాలను చిత్తుచిత్తుగా ఓడించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ ఓటర్లను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిజెపి, విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బజరంగదళ్ తదితర మతోన్మాద శక్తులు లౌకికతత్వానికి తూట్లు పొడుస్తున్నాయని, వీటిని బహిష్కరించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూ.లక్షల కోట్ల సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జమ్మూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 543 పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను పోటీలో పెట్టిందని, 175 అసెంబ్లీ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో కేవలం రెండు కుటుంబాలు మాత్రమే రాజ్యాధికారం చేపట్టి ప్రజలను దోచుకుంటున్నాయని, ఈ ఎన్నికల్లో వైసిపి, టిడిపి జనసేన, బిజెపి పార్టీలను ఓడించి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

జగన్ ప్రభుత్వాన్ని బీసీలు కూలదోయాలి : కేశన శంకరరావు

ప్రజాశక్తి - పొన్నూరు



బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి జగన్ ప్రభుత్వాన్ని కూలదోయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. మండలంలోని చింతలపూడి డివిసి కళ్యాణమండపంలో సోమవారం ఆయన విలేకర్లతో మాటాల్డఆరు. వైసిపి పాలనలో జరుగుతున్న అరాచకాలు, ఇసుక, భూ మాఫీయా, కబ్జాలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, మద్యపాన నిషేధం విఫలం వంటి అంశాలపై గుంటూరులో జరిగిన రాష్ట్ర బీసీ ప్లీనరీ సమావేశంలో చర్చించిన మీదట ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమికి మద్దతివ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. చిన్నాభిన్నమైన పరిపాలనను తిరిగి గాడిలో పెట్టగలిగే శక్తి సామర్థ్యాలు చంద్రబాబుకే ఉన్నాయని చెప్పారు. నరేంద్ర మోడీ దేశానికి, రాష్ట్రానికి అవసరం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భవిష్యత్తులో ఎన్డీఏ కూటమి అధికారాన్ని చేజిక్కించుకోవాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి మొక్కుబడిగా బీసీలకు ఎమ్మెల్సీలు, మంత్రులు, రాజ్యసభ సీట్లు కట్టబెట్టి సామాజిక న్యాయం చేస్తున్నామని జగన్ గొప్పలు చెబుతూ మోసగిస్తున్నారని విమర్శించారు. పంట ధరల స్థిరీకరణ నిధులు రూ.3 వేల కోట్లు కేటాయించామని జగన్ దాంబికాలు పలికారని, పోలవరం ప్రాజెక్టును జాప్యం చేసి డెల్టా ప్రాంత రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులు మళ్లించి వృథా చేశారన్నారు. ఈ ఎన్నికల్లో గుంటూరు ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యేగా డి.నరేంద్ర కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీసీ సంఘం యుజన అధ్యక్షులు కె.క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేశారని వైసిపిని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఎ.మల్లేశ్వరరావు, బి.రామారావు, శివయ్య, షేక్ షాపూర్, సతీష్ కుమార్, నాగరాజు, మోహన్, కిషోర్ పాల్గొన్నారు.

కులం పేరుతో మోసం

తమ మద్దతు ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులకు ఉంటుందని పలువురు కాపు నాయకులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అంబటి మురళీకృష్ణ, కిలారి వెంకట రోశయ్యలు కాపు ముసుగులో వచ్చిన మోసగాళ్లన్నారు. కులాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, వారికి ఓటుతోనే బుద్ధి చెబుతామని అన్నారు. సమావేశంలో ఎ.సాంబశివరావు, ఎస్.లింగేశ్వరరావు, వై.శ్రీరామమూర్తి, కె.రవికిరణ్, టి.ప్రసాద్, టి.శ్రీను పాల్గొన్నారు.

ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఎపిఎస్ ఆర్టీసి హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్‌లో 14వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యఅతిథిగా జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పలు సూచనలతో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని, డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడకూడదని, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని చెప్పారు. డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని అన్నారు. హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్, గుంటూరు ప్రిన్సిపల్ యస్.కె.అబ్దుల్ సలామ్ మాట్లాడుతూ ఆర్టీసి హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందడం హర్షణీయమన్నారు. వాహనం యొక్క వివిధ భాగాల గురించి వాటి పనితీరు గురించి, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్లపైన ఉండే రోడ్డు సిగ్నల్ సూచికల మార్కుల గురించి, రోడ్లకు సంబంధించిన సిగ్నల్ బోర్డుల ప్రాధాన్యత గురించి వివరించారు.

పలు గ్రామాల్లో నాదెండ్ల మనోహర్ ప్రచారం



ప్రజాశక్తి-కొల్లిపర

అభివృద్ధి, సంక్షేమం కోరుకునే ప్రతి ఒక్కరూ ఎన్‌డిఎ కూటమికి ఓటేయాలని కూటమి తరుపున తెనాలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు టిపిపి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ భార్య శ్రీరత్నతో కలిసి మండలంలోని పిడపర్తిపాలెం, పిడపర్రు, మున్నంగి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను రక్షణ కల్పించడమే కాకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తామని చెప్పారు. శ్రీరత్న మాట్లాడుతూ వైసిపికి ఐదేళ్ల అధికారం అప్పగిస్తే 15 ఏళ్ల వెనక్కు రాష్ట్రాన్ని నెట్టిందని, ఈ నేపథ్యంలో భావితరాల కోసం, భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.వేణుగోపాల్‌రెడ్డి, బి.కిషోర్‌రెడ్డి, పి.రాంబాబు, నారాయణరెడ్డి, బి.చిన్నకోటిరెడ్డి, వి.సాంబిరెడ్డి, ఆర్యశేఖర్, జి.గోవర్ధన్‌రెడ్డి, యోగానంద, చటర్జీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

నాదెండ్ల మనోహర్ సోమవారం బుర్రిపాలెం గ్రామంలో పర్యటించారు. ఆయన సతీమణి మనోహరం అంగలకుదురులో ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ నమూనా పత్రాలను ఇంటింటికి పంచారు. వైసిపి పాలనలో అభివృద్ధి దిగజారిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమం ప్రణాళికా బద్ధంగా జరుగుతుందని మనోహర్ చెప్పారు. తనతో పాటు గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.



మంచి జరిగితేనే ఓటేయమన్నది జగన్ ఒక్కడే

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటేయండని చెప్పిన సిఎం ఎవరైనా ఉన్నారంటే అది జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైసిపి ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ సోదరుడు చిరంజీవి అన్నారు. గుంటూరు జెకెసి కాలేజ్ రోడ్డు విజయపురి కాలనీలోని వైసిపి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గొర్లంట, అన్నపూర్ణ నగర్ కాలనీ వాసులు, బిజెపి గుంటూరు జిల్లా ధార్మిక సెల్ అధ్యక్షులు భవనం గోపాల్‌రెడ్డి వైసిపిలో చేరారు. వీరికి చిరంజీవి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పిఎసి చైర్మన్ బండారు శ్రీనివాస్‌రావు, బి.రజినీకాంత్ పాల్గొన్నారు.

పార్టీలలో కొనసాగుతున్న చేరికలు

ప్రజాశక్తి-తాడికొండ

మండలంలోని ముక్కామల సర్పంచ్ చిమట వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిమట పూర్ణచంద్రరావు, మరో 90 కుటుంబాలు సోమవారం వైసిపిని వీడి టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ పి.చంద్రశేఖర్, టి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. తమకు వైసిపిలో విలువ లేకుండా పోయిందని, అందుకే ఆ పార్టీని వీడామని వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు తెలిపారు వైసిపి మండల అధ్యక్షులు బి.వెంకటేశ్వరరెడ్డి వ్యవహార శైలి బాగోలేదని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. సైతం తమను పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మండలంలోని పాములపాడుకు చెందిన 20 కుటుంబాలు, నాయకులు సోమవారం టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. వీరికి మేకతోటి దయసాగర్ వైసిపి కండువాలు కప్పి ఆహ్వానించారు.

టిడిపిని వీడి వైసిపిలోకి

ప్రజాశక్తి - మంగళగిరి

మునగపాటి వెంకటేశ్వరరావు టిడిపిని వీడి కాంద్రు కమల ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి సమక్షంలో సోమవారం వైసిపిలోకి చేరారు. ఆయనకు సజ్జల రామకృష్ణారెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్ఎం రఫీ పాల్గొన్నారు.

మల్చర్ ప్రక్రియపై అవగాహన

ప్రజాశక్తి -పొన్నూరు

పంట అవశేషాలను నేలలో కలపడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి మండలంలోని ములుకుదురులో సోమవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఆత్మ పీడీ పి.రామాంజనేయులు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.రాజీవంసీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో



జొన్న, మొక్కజొన్న పంట వ్యర్థాలను మల్చర్ అనే ట్రాక్టర్‌తో చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టి నేలపై పరచాలని చెప్పారు. వర్షం వల్ల కానీ నీరు పెట్టడం వల్ల కానీ తేమ తగిలిన తరువాత గొర్రు లేదా రోటావేటర్‌తో నేలలో కలియ దున్నడం ద్వారా భూసారం పెరుగుతందని చెప్పారు. మొక్కకు కావలసిన సూక్ష్మ పోషకాలన్నీ సరిగా అంది దిగుబడి బాగా వస్తుందని తెలిపారు. పంట అవశేషాలను తగలబెట్టకుండా మల్చర్ సహాయంతో నేలలో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.వెంకట్రామయ్య, వ్యవసాయ విస్తరణాధికారి బి.వెంకటరమణ, డివి సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.



ఆటోనగర్ ప్రమాదంపై టిడిపి అసత్య ప్రచారం

వైసిపి ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ఆటోనగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై టిడిపి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని వైసిపి గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ తాము మంచి చేశానని భావిస్తేనే ఓటేయమని అభ్యర్థిస్తూ వైసిపి అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తుంటే టిడిపి నాయకులు అసత్యాలను, అబద్ధాలను ప్రచారం చేస్తూ గెలుపుకోసం అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. ఆదివారం గుంటూరు ఆటోనగర్‌లో గాలికి కరెంట్ తీగలు తెగి అక్కడ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలపై నిప్పు రవ్వలు పడి అగ్నిప్రమాదం సంభవిస్తే టిడిపి నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఘటన జరిగిన వెంటనే తమపార్టీ అభ్యర్థి నూరిఫాతిమా ఆటోనగర్‌కు చేరుకుని ఫైర్స్ సిబ్బందిని అప్రమత్తం చేసి బాధితులు అండగా నిలిచిన సందర్భాన్ని గ్రహించాలన్నారు. రెండ్రోజుల క్రితం ఆటోనగర్లో జరిగిన వైసిపి ఆత్మీయ సమావేశం విజయవంతం కావడంతో దానిని తట్టుకోలేక టిడిపి వారు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పెమ్మసాని తనపై చేస్తున్న మైనింగ్ అసత్య ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని, ఆరోపణలను నిరూపిస్తే తాను తన ఆస్తి మొత్తాన్ని రాసిస్తానని పెమ్మసాని చంద్రశేఖర్‌కు సవాల్ విసిరారు. అమెరికా నుండి డబ్బులతో వచ్చి రాజకీయాల చేయాలని చూస్తే అది సాగే పని కాదన్నారు. సమావేశంలో వైసిపి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా, నాయకులు జియావుల్ రెహమాన్, గులాం రసూల్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మద్యం అరికట్టేందుకు సహకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో మద్యం నిల్వ చేయటం, పంపిణీని అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సార్వత్రిక ఎన్నికల్లో మద్యం నియంత్రణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం సరఫరా కాకుండా పూర్తిస్థాయిలో నిఘాపెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 8,325 లీటర్ల మద్యం సీజ్ చేయటం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న 102 మద్యం రిటైల్ ఔట్‌లెట్లు, 102 బార్లు, 9 క్లబ్‌లలో మద్యం అమ్మకాలు, సరఫరాపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. సిసి కెమెరాల ద్వారా లైవ్‌స్ట్రీమ్‌ను అధికారులు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. మద్యం డిపోలలో సిసి కెమెరాలు, మద్యం సరఫరా చేసే వాహనాలకు జిపిఎస్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్సైజ్, ప్రొబేషన్ శాఖ అధికారులు మద్యం షాపులలో అమ్మకాలలో నిఘా పెట్టడంతోపాటు, ఇతర ప్రాంతాల నుండి మద్యం సరఫరా కాకుండా పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమంగా నిల్వ చేసిన మద్యం పట్టుబడితే సరఫరా చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నిల్వ చేసిన సంబంధిత అభ్యర్థిపై కేసు నమోదు చేయటంతోపాటు, మద్యం విలువను అతని ఎన్నికల ఖర్చుగా నమోదు చేయించాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ పెద్ది రోజా, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, ఎస్ఈబి అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటరామిరెడ్డి, ఎస్ఈబి సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అధ్యాపకుడు ధరణీకుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నార్నె ధరణీకుమార్‌కు అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ధరణీకుమార్ 'పెర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ సోలార్ సిస్టమ్స్ అండర్ పార్షియల్ షేడింగ్ కండిషన్స్' అనే అంశంపై అన్నామలై యూనివర్సిటీకి చెందిన డాక్టర్ టి.ఎ.రమేష్‌కుమార్, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన డాక్టర్ రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పిహెచ్‌డి పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో పిహెచ్‌డి కలిగిన స్టాఫ్ మొత్తం 147 మంది ఉన్నారని, పరిశోధనలను కళాశాల ప్రోత్సహిస్తుందని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. పిహెచ్‌డి పొందిన నార్నె ధరణీకుమార్‌కు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై సమస్యలుంటే చెప్పండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల నిర్వహణలో భాగంగా నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులగా సుమీత్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నికలకు సంబంధించి సమస్యల పరిష్కారానికి 9154690389 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని పల్నాడు జిల్లా ఎన్నికలాధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. నరసరావుపేట, వినుకొండ, గురుజాల, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు 9154630396 నంబరులో అందుబాటులో ఉంటుంది. పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి అసెంబ్లీ నియోజికవర్గాలకు సంబంధించి వ్యయ పరిశీలకులుగా నియమితులైన ఆర్.గౌతమున్ 9154690398 నంబరులో అందుబాటులో ఉంటారు. పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు గాను జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన భూరే సర్వేశ్వర్ నరేంద్ర ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంబంధించి 9154690367 నంబరులో అందుబాటులో ఉంటారు. చిలకలూరిపేట, నరసరావుపేట మరియు వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన శ్రీహరి ప్రతాప్ షాహి 9154690375 నంబరులో అందుబాటులో ఉంటారు. పోలీస్ శాఖ పరిశీలకులుగా నిమామితులైన అజీత్‌సింగ్ 9654958832 నంబరులో అందుబాటులో ఉంటారు. ఆయా అధికారులకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఫిర్యాదు చేయొచ్చని ఎన్నికలాధికారి సూచించారు.



హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ పూర్తి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, బాపట్ల జిల్లాల నుండి హజ్ యాత్రకు వెళుతున్న 232 మందికి ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం ముగిసింది. స్థానిక జిజిహెచ్, సుశ్రుతా హాల్లో నిర్వహించిన ఈ వ్యాక్సినేషన్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సందర్శించి, హజ్ యాత్రికుల వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ కార్యక్రమం సజావుగా నిర్వహించటానికి పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు, పోలియో, మెదడువాపు, ఇన్‌ఫ్లూయెంజా నివారణకు వ్యాక్సిన్‌లు, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల జిల్లాల వ్యాధి నిరోధక టీకాల అధికారులు, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ టి.వెంకటేశ్వరరావు పాల్గొని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

పెమ్మసాని చంద్రశేఖర్ ఒక వలస పక్షి

గుంటూరు పార్లమెంట్ స్థానం సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లాలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి అనేక ప్రాంతాల నుండి పక్షులు వలస వస్తూ ఉంటాయని, అక్కడ కొన్ని రోజులు సేద తీరి వెళ్లిపోతుంటాయని, అలాగే గుంటూరు పార్లమెంట్‌కు టిడిపి తరపున పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ కూడా ఒక వసల పక్షితో సమానం అని ఇండియా వేదిక గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంపై పెద్ద చర్చ జరుగుతుందని, పెద్ద మొత్తంలో ధనం వెచ్చించి ఒక ఎన్ఆర్ఐ ఇక్కడ ఎంపిగా గెలవాలని చూస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన గెలిస్తే కనబడడు, వినబడడు అని, ఎక్కడ ఉంటాడో కూడా తెలియదనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. ముస్లిం రిజర్వేషన్లపై మోదీ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఈయన కనీసం ప్రకటన చేయగలరా అని ప్రశ్నించారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన సద్దాం హుస్సేన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం ఆయన రాజకీయ పరిజ్ఞానాన్ని తెలియచేస్తుందన్నారు. గెలిచినా, ఓడినా ప్రజల్లో ఉండేది, ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రత్యేక హెూదా ఇవ్వకుండా రాష్ట్రాన్ని మోసం చేసిన మోడీకి టిడిపి, వైసిపి మద్దతు ఇస్తున్నాయన్నారు. పెమ్మసాని, రోశయ్య గెలుపు అంటే అది మోదీకే ఉపయోగం అన్నారు. కావున కంకికొడవలి గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి, నాయకులు హనుమంతరావు, ఎ.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్



ఓటు హక్కును వినియోగించుకుంటున్న సిబ్బంది

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న సిబ్బంది కోసం ఏసీ కాలేజిలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటర్లకు తగిన సహకారం అందించటానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఆర్ఒ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం స్థానిక ఏసి కాలేజిలోని ఫెసిలిటేషన్ సెంటర్‌ని పరిశీలించి, పోస్టల్ బ్యాలెట్‌కి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ముందుగా హెల్ప్‌డెస్క్‌లో తమ ఓటు వివరాలు తెలుసుకొని, ఓటింగ్ కోసం వివిధ నియోజక వర్గాలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన 6 ప్రత్యేక కౌంటర్లలో ఓటు వినియోగించుకోవచ్చని తెలిపారు. 7వ తేదీ ఓపిఓలు, 8వ తేదీ పోలీసులు, ఎన్నికల విధులు కేటాయించబడిన ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు చేశామన్నారు.

పిఒ, ఎపిఓ శిక్షణను పరిశీలించిన కమిషనర్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటిస్తూ పోలింగ్ రోజు సమన్వయంతో విధులు నిర్వహించాలని గుంటూరు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి చెప్పారు. సోమవారం ఏసీ కాలేజీలో రెండో రోజు జరుగతున్న తూర్పు నియోజకవర్గ పిఓలు, ఏపిఓలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణను పరిశీలించారు. ఎన్నికల విధులను వివిధ బృందాలు సమన్వయంతో చేపడితే పోలింగ్ విజయవంతంగా జరుగుతుందని, పోలింగ్‌కి సంబంధించి అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోలింగ్‌కు ముందే మాక్ పోలింగ్ చేపట్టాలని, మాక్ పోలింగ్‌లో అభ్యర్థుల ఏజెంట్లు ఉండేలా చూడాలని అన్నారు. ఈవిఎం కవర్లు, స్ట్రూట్ని కవర్లు అందులో ఫైల్ చేయాల్సిన డాక్యుమెంట్లు తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో భాగంగా డెమో ఈవిఎంల కమిషనింగ్ చేయిస్తారని, పోలింగ్ రోజు ఏసమస్య వచ్చినా తక్షణం ఉన్నతాధికారుల దష్టికి తీసుకురావాలని తెలిపారు.